

# గ్రీన్ కార్డ్

## - మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 2000 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**"నీకు ప్రాబ్లమ్** లేకుండా వీసా వచ్చిందన్నమాట" అడిగింది మానసి ఫోన్‌లో.

"అవును."

"ఎప్పుడు ప్రయాణం?"

ఆమె తన కంఠంలోని దిగులుని విరించి గుర్తుపట్టకూడదనుకున్నా అందుకామెకి సాధ్యం కాలేదు.

"వచ్చేవారం. యివాళ ట్రావెల్ ఏజెంట్ దగ్గరికి వెళ్ళాడు మా అన్నయ్య. ఎప్పుడు కలుద్దాం?"

"రేపు."

"ఇవాళెందుకు కలవకూడదు?" అడిగాడు.

"మా తమ్ముడికి చిచ్చుబుడ్లు, మతాబులు చేయటానికి సహాయం చేస్తున్నాను. మా ఫేమిలీ అంతా కలిసి కూర్చుని ఆ పని చేస్తున్నాం."

"సరే రేపెప్పుడు? ఎక్కడ?"

ఆ విషయాలు మాట్లాడుకుని ఫిక్స్ చేసుకున్నాక ఫోన్ పెట్టేశాడు విరించి. అతనికి అమెరికాకి వెళుతున్నందుకు ఎక్సయిటింగ్‌గా వున్నా, మానసిని, తనవాళ్ళందర్నీ వదిలి వెళుతున్నందుకు మళ్ళీ చాలా కాలందాకా చూడలేకపోతున్నందుకు దిగులుగా వుంది.

ట్రావెల్ ఏజంట్‌నుంచి వచ్చిన గోపీనాథ్ చెప్పాడు విరించికి.

"దీపావళి రోజే నీ ప్రయాణం."

"అదేమిటి? ఇంకో రోజాగి చేయించాల్సింది. పండగ రోజే దేనికి చేయించావు?" అడిగింది గోపీనాథ్ తల్లి.

"థాంగ్స్ గివింగ్ డే రష్ వల్ల మరో వారం పదిరోజులదాకా టికెట్లు లేవు."

"థాంక్స్ గివింగ్‌డే అంటే?" అడిగాడు విరించి ఆసక్తిగా.

"ఇది అమెరికాలో ప్రతి నవంబర్ నెలలో జరుపుకునే పండగ. తమకి సంతోషకరమైనవన్నీ ఇచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు జరుపుకునే పండగ. ఇంగ్లండ్ నించి వచ్చి అమెరికాలో సెటిల్ అయిన్ అవాళ్ళు ఈ పండగని ఏటా జరుపుకోవటం ఆరంభించారు. యిదివరలో ప్రతి ఏడూ అమెరికన్ ప్రెసిడెంట్స్ థాంక్స్ గివింగ్ డే ఫలానా రోజు అని ప్రకటిస్తూ వచ్చేవారు. నైన్టీన్ పార్టీవన్‌లో యు.ఎస్ కాంగ్రెస్ ప్రతి ఏటా నవంబర్ నెలలోని ఆఖరి మంగళవారం థాంక్స్ గివింగ్‌డేగా సెలబ్రేట్ చేలని నిర్ణయించింది. మన సంక్రాంతిలాగా యిది పంట చేతికి వచ్చాక జరుపుకునే పండగ."

"అమెరికాకి సంక్రాంతి అన్నమాట. అందుకనా రష్?" అడిగింది తల్లి.

"అవును. ఆ రోజు కుటుంబ సభ్యులు ఎక్కడ వున్నా తమ తల్లిదండ్రుల ఇంటికి వస్తారు. ఆ రోజు రాత్రి భోజనం వాళ్ళకి పెద్ద విశేషం. అంతా కలిసి తింటూ ఆ ఏడాది దేవుడు తమకి చేసిన మేలు గురించి చెప్పుకుంటారు. ఆ రాత్రి తప్పనిసరిగా టర్కీకోడిని కోసి వండుతారు. థాంక్స్ గివింగ్ డే నాటి రాత్రి స్టఫ్ట్ టర్కీ, పంప్‌కి నో పై, మాష్ట్ పొటాటోస్ సలాడ్స్ వండుకుంటారు."

"ఇంగ్లండ్‌లో కూడా దీన్ని జరుపుకుంటారా?" అడిగాడు అరుణాచలం.

"నాకు తెలీదు. కెనడాలో జరుపుకుంటారు గానీ వాళ్ళు నవంబర్‌లోకాక అక్టోబరు నెల్లో రెండో మంగళవారం జరుపుకుంటారు" చెప్పాడు గోపీనాథ్.

ఆ రాత్రి గోపీనాథ్ ఓ ఫారం జిరాక్స్ కాపీ తీసి విరించికిచ్చి చెప్పాడు.

"నువ్వు అమెరికా వెళ్ళాక ఇలాంటి దాన్ని ఫిలప్ చేయాల్సివుంటుంది. నమునాగా దీన్ని ఫిలప్ చెయ్యి చూస్తాను."

విరించి దాన్ని తీసుకుని చూసాడు. అది యు.ఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్‌లోని భాగమైన ఐ అండ్ ఎన్. ఎస్ ముద్రించిన 'రిక్వెస్ట్ ఫర్ అసైలమ్ ఇన్ యునైటెడ్ స్టేట్స్' అనే ఫారం. పార్ట్ ఏ నించి పార్ట్ ఇ దాకా అయిదు విభాగాల్లో అనేక ప్రశ్నలున్నాయి, ఆ అయిదు పేజీల అప్లికేషన్ ఫారంలో.

"ఇవాళ నించి దీని విషయంలో క్లాస్ తీసుకుంటాను. ఇదే మన పథకం మొత్తం క్లయిమాక్స్. ఇందులో సక్సెస్ అవుతే మన శ్రమ ఫలించినట్టే" చెప్పాడు గోపీనాథ్.

## 12

తన అమెరికా ప్రయాణానికి మానసి అంతలా చలించిపోతుందనుకోలేదు విరించి.

"రేపే ప్రయాణం. రాత్రి ఏడున్నరకి బాంబేకి, అక్కడనించి అర్ధరాత్రి శాన్‌ఫ్రాన్సిస్కోకి" చెప్పాడు విరించి.

వెంటనే మానసి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. దుఃఖం పొంగుకు రావడంతో నోటికి కర్చీఫ్ అడ్డుపెట్టుకున్నా, కళ్ళు ఆ అనుభూతిని దాచలేకపోయాయి.

"ఏమిటి? ఏడుస్తున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు విరించి.

నోరు విప్పడానికి ఆమెకి దుఃఖం అడ్డుపడింది. ఆమె మొహాన్ని పరిశీలనగా చూసి చెప్పాడు.

"అరె! నిజంగానే ఏడుస్తున్నావు?"

దుఃఖాన్ని దిగమింగుకుంటూ మానసి కన్నీటిని కర్చీఫ్‌తో తుడుచుకుంది. టేంక్‌బండ్ మీద నడిచిపోతున్న ఒకరిద్దరు బెంచ్ మీద విరించి ప్రక్కన కూర్చున్న మానసి వంక తలతిప్పి ఆసక్తిగా చూసుకుంటూ వెళ్ళారు.

"వాటిజ్ దిస్? ఎందుకేడుస్తున్నావ్?" ఆశ్చర్యంలోంచి తేరుకుని విరించి మళ్ళీ ప్రశ్నించాడు.

మానసి చేతిమీద తన చేతిని వేసాడు. ఆమె సర్దుకోడానికి నాలుగైదు నిమిషాలు పట్టింది.

"చెప్పు దేనికి ఏడుపొచ్చింది నీకు?"

"ఏమో? ఏడుద్దామని ఏడవలేదు. దానంతట అదే వచ్చింది."

చిన్నగా నిట్టూర్చి చెప్పాడు విరించి.

"నాకూ నిన్ను విడిచి వెళ్ళడానికి బాధగానే వుంది. కానీ నీకున్నంత బాధకాదు."

ఇద్దరి మధ్యా కొన్ని క్షణాల మౌనం.

"నీకు ఎప్పటినించో చెపుతున్నాగా నేను అమెరికా వెళతానని" చెప్పాడు విరించి.

"చెప్పావు."

"షడన్‌గా చెపితే ఏడ్వవచ్చు. మొదట్నించీ చెపుతున్నాగా."

"ఇది ఎలాంటి ఏడుపంటే ఫర్ ఎగ్జాంపుల్ మన బంధువొకరికి ఇంకా నయం కాకపోతాడని తెలిసినా, అతను నిజంగా చచ్చిపోతే వచ్చేలాంటి ఏడుపు."

"నిజమే చాలా ఏళ్ళు కనపడకపోవడం దాదాపు చావులాంటిదే రెండింటి రిజల్ట్ ఒకటే. దూరమయితే అది ఏజ్ గుడ్ ఏజ్ డెత్.. దో, ఏ టెంపరరి షార్ట్ లివ్డ్ డెత్. తిరిగి రావడానికి ఇయర్స్ పడుతుంది. ఎన్ని యియర్లో ఖచ్చితంగా చెప్పలేను."

"మా బావ, అక్క అమెరికాలోనే వున్నారు. ఎప్పుడినా వాళ్ళింటికి రావచ్చు. నీ ఎడ్రస్సు ఇవ్వు."

"థాంక్స్ టు సబీర్ భయ్యా. ఇ - మెయిల్‌లో టచ్‌లో వుందాం. ప్రపంచంలో ఎక్కడున్నా నిమిషాల్లో ఒకరికొకరు కమ్యూనికేట్ చేసుకోడానికి అది వుందిగా?"

మళ్ళీ అడిగాడు "ఈలోగా పాత తెలుగు సినిమాల్లోలాగా మీవాళ్ళు నీకు పెళ్ళి చెయ్యరుగా?"

"చదువొకటి వుందిగా. అదయ్యేదాకా చెయ్యరు. అయినా పాత తెలుగు సినిమా రోజుల్లోలా రాసిన వుత్తరాలు పెద్దవాళ్ళు చింపలేని ఇ - మెయిల్ వుంది కదా." నవ్వింది మానసి.

"గుడ్, నేను మాత్రం ఎవర్నీ చేసుకోను. ఐ మీన్ ముందు మన మేచ్ ఏ కారణంగానైనా ఫిక్స్ కాదని తెలిసేదాకా."

"వి విల్ సీ వాట్ ఈజ్ ఇన్ స్టోర్ట్ ఫర్ బోత్ ఆఫ్ అజ్. నీ ప్రయత్నం ఫెయిలై నీకు పొలిటికల్ అసైలమ్ రాకుండా మీ అన్నయ్యలా తిరిగి వచ్చేస్తావేమో? ఎవరికి తెలుసు?"

"అలా జరగదీసారి."

"నీవు వుండేది శాన్‌ఫ్రాన్‌సిస్కోలోనా?" అడిగింది మానసి.

"అవును. ఆ దగ్గర్లోనే బర్కిలి అనే వూళ్ళో."

"మా నాన్నగారు తాగే సిగరెట్లవి. పేరు తేలిగ్గా గుర్తుంటుంది" నవ్వింది మానసి.

"దానికన్నా తేలిగ్గా గుర్తుండేది నా ఇ - మెయిల్ ఎడ్రస్. అమెరికాలో విదేశస్థులని ఎలియన్స్ అని అంటారు. కానీ మనలా ఫారినర్స్ అనరని తెలుసా?"

"తెలుసు, ఎలియన్ అంటారని."

"ఎలియన్ ఇన్ యు ఎస్ ఏ ఎట్ హాట్ మెయిల్ డాట్‌కామ్. నేను యు.ఎస్.ఏలోని ఎలియన్‌నే కదా, నాకు పొలిటికల్ అసైలమ్ వాళ్ళు ఏక్సెప్ట్ చేసేదాకా."

"ఇది తేలిగ్గా గుర్తుంటుంది" చెప్పింది మానసి.

ఇద్దరు కొద్దిసేపు మాటలు కొరవడినట్లుగా మౌనంగా వుండి పోయారు. ఇద్దరి గుండెల్లో దిగులు గూడుకట్టుకుని వుండటం ఒకరికొకరికి తెలుస్తోంది.

"నీ ఫేవరెట్ టాపిక్ మీద ఓ జోక్ చదివాను నిన్న, ఇంటర్‌నెట్‌లో ఫ్రీ సబ్‌స్క్రిప్షన్ మేగ్‌లో" చెప్పింది మానసి.

"చెప్పు" అడిగాడు విరించి.

"నీ ఫేవరెట్ సబ్జెక్ట్ ఏమిటో అర్థమైందా?" అడిగింది మానసి నవ్వుతూ.

"ఓ సైక్రియాటిస్ట్ దగ్గరికి ఓ అమ్మాయి మానసిక సమస్యతో వెళ్ళింది. ముందు ఆ డాక్టర్ ఆమెని గాఢంగా ముద్దు పెట్టుకుని 'నా సమస్య తీరింది. ఇప్పుడు నీ సమస్యేమిటో చెప్పు' అన్నాట్ట. ఇప్పుడు ఇదే నా ఫేవరెట్ టాపిక్."

సన్నగా నవ్వి చెప్పింది మానసి. "కరెక్ట్. నే చదివిన జోక్‌లో కూడా ఇలాంటి బేడ్ డాక్టరే వున్నాడు. ఓ డాక్టర్ దగ్గరికి ఓ పేషెంట్ వెళ్ళింది. ఆమెని దుస్తులు విడిచి ఎగ్జామినేషన్ టేబుల్ మీద పడుకోమన్నాడు డాక్టర్. ఆమెని పరీక్షిస్తూంటే ఆమె "డాక్టర్ 'కిస్ మి క్విక్'" అన్నదిట. ఎందుకని డాక్టర్ అడిగితే 'నాతో ఇంటర్ కోర్స్‌లో ఎవరు పాల్గొన్నా అతను నన్ను ముద్దుపెట్టుకోవడం నాకిష్టం కనుక అన్నదిట."

ఇద్దరు ఆ జోక్‌కి నవ్వుకున్నారు. ఇందాక మానసి ఏడుస్తూండగా చూసుకుంటూ వాకింగ్‌కి వెళుతూ నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్న ఆ జంటని ఇందాకటిలానే ఆసక్తిగా చూసుకుంటూ వెళ్ళారు.

మానసి విరించి లేచి, ఒకరిచేతిని మరొకరు పట్టుకుని నడుచుకుంటూ స్కూటర్‌వైపు వెళ్ళారు.

విరించి ఇంట్లో అంతా హడావుడిగా వుంది. మళ్ళీ చాలా ఏళ్ళకి కాని రాడు. కాబట్టి అతని తల్లిదండ్రుల మనస్థితి స్వల్పంగా ఆందోళనగా వుంది. అతను స్టేట్స్ వెళుతున్నాడని తెలిసి పదిమంది దాకా వుత్తరాలు, పచ్చళ్ళ సీసాలు, టెక్స్ట్ పుస్తకాలు, కాటన్ దుస్తులు, షూస్‌లాంటివి తెచ్చిచ్చారు, తీసుకెళ్ళి తమవాళ్ళకి అందచేయమని. వాళ్ళంతా బర్కిలీకి రెండు మూడు వందల మైళ్ళలోపు దూరంలోని వాళ్ళే. వాళ్ళే కలెక్ట్ చేసుకునే పద్ధతిమీద అంగీకరించాడు విరించి.

అతని సూట్‌కేసులో పావువంతు ఇతరుల ప్యాకెట్లతోనే నిండిపోయాయి. డాలర్స్ సేవ్ చేసుకోడానికి ఓ ఏడాదికి సరిపడ డబ్బులు, హేర్ ఆయిల్, దువ్వెనలు, పౌడర్, షేవింగ్ క్రీమ్, షేవింగ్ క్రేటిడ్జెస్‌లాంటివి వెంట తీసుకువెళుతున్నాడు విరించి గోపీనాథ్ సలహామీద.

అతనికి వర్క్‌పర్మిట్ వెంటనే వస్తుంది. కాబట్టి వుద్యోగం దొరుకుతుంది. అయినా వచ్చే ఆదాయం ఖర్చు చేయకుండా కొంత దాచుకోవడానికివి.

ఓ పంతొమ్మిదేళ్ళ బంధువుల పిల్ల ఎప్పటికన్నా క్లోజ్‌గా విరించితో మూవ్ అయింది. అతని సూట్‌కేస్ సర్దడంలో సహాయం చేసింది. తను స్వయంగా చేసిన కొబ్బరిలౌజు ప్యాకెట్ యిచ్చింది.

అదంతా అమెరికా భర్తని పొందడానికి ఆమె ప్లాన్ అనుకున్నారు విరించి కుటుంబ సభ్యులు. మరొకావిడ ఏకంగా విరించినే అడిగేసింది, ఇండియాకి పెళ్ళిచూపులకి వచ్చినప్పుడు తన కూతుర్ని మొదటగా చూడాలని. అమెరికాకి ఇల్లీగల్‌గా సెటిల్ అవడమే అతని ప్రయాణపు వుద్దేశం అని ఎవరికీ తెలీదు. ఉద్యోగం వస్తే వెళుతున్నాడని అందరికీ అబద్ధం చెప్పారు.

గోపీనాథ్ ఎవిడెన్స్ ఫైల్‌ని ఇచ్చి చెప్పాడు.

"ఎంతో కష్టపడి సేకరించానిది. హేండ్ లగేజ్‌లో వుంచుకో. పోకూడదు."

"బుక్ చేసే బేగేజ్‌లో వుంచితే ఏం?" అడిగాడు విరించి.

"అమెరికాలో ఇది నీకు అతి ముఖ్యమయినది, అసలీ ఫైల్ కోసమే నువ్వక్కడికి వెళ్ళేది. ఒకవేళ బేగేజ్ మిస్ అయితే మొత్తం గోవిందా అవుతుంది. అందుకని కూడా తీసుకెళ్ళే ఎయిర్ బేగ్‌లో వుంచు."

సాయంత్రం అయిదుంపావుకల్లా అంతా ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్నారు. విరించి లోపలికి వెళ్ళి టిక్కెట్ ఇచ్చి లగేజ్ బుక్ చేసి బోర్డింగ్ పాస్ తీసుకుని బయటకి వచ్చాడు.

ఆరుం పావుకి వచ్చింది మానసి చేతిలో పూలగుత్తితో. విరించికిచ్చి చెప్పింది.

"వదిలెయ్యక విమానంలోకి తీసుకెళ్ళి చూడు."

ఆమెని అందరికీ పరిచయం చేశాడు. విరించి తల్లి మానసి వంక అందరికన్నా శ్రద్ధగా చూసింది, ఎయిర్‌పోర్ట్‌కి సెండాఫ్‌కి వచ్చేంత పరిచయంగల ఆ అమ్మాయి ఎవరా అని.

బోర్డింగ్ కాల్ అనౌన్స్ చేయగానే అందరి దగ్గర సెండాఫ్ తీసుకున్నాడు విరించి. చాలామది కళ్ళల్లో నీళ్ళు, గోపీనాథ్ కళ్ళల్లో మాత్రం విజయగర్వం.

విమానం సగం దారిలో వుండగా మానసి ఇచ్చిన పూలగుత్తికి చుట్టివున్న రబ్బర్ బేండ్‌ని తీసి దానికి చుట్టి వున్న చిన్న కవరుని తీశాడు. అందులోంచి లెటర్ తీసి చూశాడు. మానసి చేతి వ్రాతతో ఇంగ్లీష్‌లో వున్నాయి రెండు వాక్యాలు.

"మనిద్దరికి ఆయుర్దాయం సరిగ్గా వందేళ్ళయితే, నా ఆయుర్దాయంలోంచి ఓరోజు తగ్గించి దాన్ని నీకు కలపమని దేముడ్ని వేడుకుంటున్నాను. ఎందుకంటే, నీ కన్నా ముందుగా నీ భార్యగా పోవడమే నేను దేముడ్ని కోరుకునే ఏకైక వరం."

క్షణాల్లో విరించి కళ్ళు తడి అయ్యాయి. టేంక్ బండ్ మీద మానసి ఎందుకు ఏడ్చిందో అప్పుడర్థమైందతనికి.

శాన్‌ఫ్రేన్సిస్కో అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో విరించి పాస్‌పోర్ట్‌లో ఇమిగ్రేష ఆఫీసర్ స్టాంప్ కొట్టి చెప్పాడు చిరునవ్వుతో.

"హోప్ యు విల్ ఎంజాయ్ యువర్ స్టే ఇన్ స్టేట్స్."

"థాంక్ యూ" చెప్పాడు విరించి.

తన పాస్‌పోర్టుని తీసుకుని అతని పక్కనించి ముందుకు కదిలాడు. అరైవల్స్ లాంజ్‌లోకి వెళ్ళి డాలర్ నోటుని ట్రాలీలున్న యంత్రం స్లాట్‌లో వుంచాడు. అది ఆ నోటుని పీల్చుకుని ఓ ట్రాలీని రిలీజ్ చేసింది. దాంట్లో తన లగేజ్ వేసుకుని తోసుకుంటూ బయటికి నడిచాడు.

బయట అనేకమంది ప్రయాణీకులను రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన వారు వున్నారు. చాలామంది ఇండియన్స్ కనిపించారు విరించికి. ఓ చిన్న కుర్రాడి చేతిలో ఆరెంజ్ రంగు కాగితం మీద లావుపాటి నల్ల పెన్నుతో రాసిన 'మిస్టర్ విరించి' అన్న ఇంగ్లీష్ అక్షరాలు కనిపించాయి. వాళ్ళ దగ్గరకి వెళ్ళి చెప్పాడు ఇంగ్లీష్‌లో.

"హలో నా పేరు విరించి."

వెంటనే సునీత చెప్పింది చెయ్యి చాపి.

"సునీత."

ఆమెతో కరచాలనం చేయడానికి విరించి ఇబ్బందిగా ఫీలయ్యాడు. కానీ ఆమెకలాంటివేం లేవు. తర్వాత ఆమె పక్కనున్నతను కరచాలనం చేస్తూ చెప్పాడు.

"దిసీజ్ దివాకర్ సింగ్."

సునీత తన మొదటి భర్తకి విడాకులిచ్చాక చేసుకున్న రెండో భర్త అతనని గ్రహించాడు విరించి.

"హాయ్! అయామ్ రాకేష్" చెప్పాడు చేతిలో పేడ్ పట్టుకున్న ఎనిమిదేళ్ళ కుర్రాడు అమెరికన్ ఏక్సెంట్‌లో.

"హాయ్! గ్లాడ్ టు సీ యూ."

అంతా ట్రాలీతో పార్కింగ్ లాట్‌వైపు వెళ్ళారు. కొన్ని వందల కార్లు పార్కు చేసి వున్నాయక్కడ. దూరం నించే దివాకర్ రిమోట్‌తో కారు డోర్ లాక్ తీసాడు. అంతా ఆ టయోటా కారులోకి ఎక్కాక కదిలింది బండి.

తన తమ్ముడు శతృఘ్నని పరిచయం చేశాడు రాకేష్ విరించికి సీట్ బెల్ట్ అమర్చి.

"జర్నీ బాగా జరిగిందా?" అడిగింది సునీత.

"ఆహా! షేక్స్‌పియర్ సీట్‌లో కూరుని వచ్చాను."

"షేక్స్‌పియర్ సీటా?"

"నా సీట్ నెంబర్ టు బి - 2 బి ఆర్ నాట్ 2 బి...." నవ్వాడు విరించి.

"మమ్. స్పీక్ ఇంగ్లీష్" అభ్యంతరం చెప్పాడు రాకేష్.

ఆ తర్వాత సంభాషణంతా ఎక్కువగా ఇంగ్లీష్‌లోనే సాగింది, విరించి వాళ్ళింట్లో వున్నంతకాలం.

"గోపీ ఎలా వున్నాడు?" అడిగాడు దివాకర్ సింగ్.

"ఫైన్."

"వెరీ అన్‌ఫార్చునేట్ ఫెలో."

"హి హేజ్ నో రిగ్రెట్స్ టు లీవ్ అమెరికా" చెప్పాడు విరించి.

"ఐనో.. ఇక్కడ అమెరికా అనరు. స్టేట్స్ అంటారెక్కువగా."

బర్కిలిలోని వాళ్ళింటికి తీసుకెళ్ళాడు విరించిని.

ఆ రోడ్లు, కార్లు షాపుల బయట డెకరేషన్స్ మొదలయినవి చూస్తే విరించి కళ్ళు తిరిగిపోయాయి. తనెప్పుడైనా ఈ కార్ల సముదాయంలో ఇలా డ్రయివ్ చేయగలడా అన్న భయం కూడా కలిగిందతనికి.

కార్లోంచే రిమోట్‌తో కారు షెడ్డు తలుపు తెరిచాడు దివాకర్. కారు పార్క్ చేశాక షెడ్డు తలుపు మూసి షెడ్డులోంచే ఇంట్లోకి దారి తీశాడు. ఆ షెడ్‌లో ఇంకో కారు కూడా వుంది. విరించికి గెస్ట్ రూం చూపించి చెప్పింది సునీత.

"నీకు బాగా నిద్ర వస్తుండి వుండాలి. ఇండియాలో ఇప్పుడు అర్ధరాత్రి పడుకుంటే పడుకో. ఈ జెట్ లాగ్‌లోంచి బయట పడటానికి రెండు రోజులు పడుతుంది నాకయితే. రాత్రి మేం నిద్రలో వుండగా, మెలకువ వస్తే ఫ్రిజ్‌లో తినేవి, తాగేవి వున్నాయి. మొహమాటపడక. ఆరెంజ్ జ్యూస్, కోక్, పెప్సీలు అక్కడా వచ్చాయి. కానీ క్రేన్ బెర్రి జ్యూస్ ఇండియాలో దొరకదు. అది రుచి చూడు."

దుస్తులు మార్చుకున్నాక మేంటిల్ పీస్ మీద వున్న ఓ మేగ్‌జైన్ ని తీసుకుని పక్కమీదకి చేరాడు విరించి.

అందులో ఓ పేజీలో ఓ ప్రకటన అతన్నాకర్షించింది. ది గ్రేట్ అమెరికన్ ట్రయిన్ అడ్వెంచర్ బై వీడియో జర్నీ. శాన్‌ఫ్రాన్సిస్కో నించి, వాషింగ్‌టన్ డిసి దాకా 3,200 మైళ్ళు ప్రయాణం. ఆ రెండు గంటల కేసెట్ ఖరీదు పంతొమ్మిది డాలర్ల తొంభై అయిదుసెంట్లు. ఇంట్లో కూర్చుని అమెరికాని తేలిగ్గా, చవకగా చూసే ఆ మార్గం అతనికి నచ్చింది. దాన్ని ఆర్డర్ చేసే కూపన్‌ని చింపుకున్నాడు సునీతని అడిగి.

"నువ్వు ఇక్కడ కాలుపెట్టిన గంటన్నరలో అమెరికన్‌వయిపోయావు" నవ్వింది.

"ఎలా?" అడిగాడు విరించి.

"రేపటి సంపాదనని ఎలా ఖర్చు చేయాలా అని ఇవాళ ఆలోచించడం ఇక్కడ పద్ధతి. రేపటి డాలర్‌ని ఇవాళే ఖర్చుచేస్తారిక్కడ."

"అంటే ఎప్పుడూ అప్పుల్లో వుంటారన్నమాట" అడిగాడు విరించి.

"ఎప్పుడూ, పూర్తిగా" చెప్పింది సునీత.

నాలుగైదు రోజుల్లో విరించికి క్రమంగా అక్కడి వాతావరనం, పద్ధతులు అలవాటవసాగాయి. ఇండియాలో కంటే అమెరికాలో కాలం చాలా వేగంగా పరిగెత్తుతుందని గ్రహించాడు. ఉదయం ఆరుకి లేస్తే ఏడున్నరకల్లా అంతా బయటపడాలి. తొమ్మిదికి వర్క్ ప్లేస్‌కి చేరుకోడానికి.

మళ్ళీ రాత్రి ఎనిమిదింపావుకి తిరిగి వస్తారు. సునీత, దివాకర్ పనిచేసేది పక్క పక్క బిల్డింగ్స్ కాబట్టి ఒకే కారు వాడతారు. రెండోకారు సునీత వేరే చోట వుద్యోగం చేసినప్పటిది.

శుక్రవారం రాత్రి ఆఫీసునించి తిరిగి వచ్చాక అడిగాడు దివాకర్.

"ఎలా గడుస్తోంది నీకు?"

"కంప్యూటర్, టి.వి, ఫ్రిజ్‌లే నా కాలక్షేపాలు. బ్రౌజింగ్‌కి ఇక్కడ ఎక్కువ టైం దొరుకుతోంది."

"నీకు విస్కీ అలవాటుందా?" అడిగాడు దివాకర్.

"అప్పుడప్పుడు."

ఇద్దరికి రెండు గ్లాసుల్లో స్కాచ్ విస్కీ కలుపుకొచ్చాడు దివాకర్.

"ప్రతి శుక్ర, శనివారాల రాత్రుళ్ళే నాకు మందు తీసుకునే అవకాశం. మర్నాడు సెలవు కాబట్టి ఆలస్యంగా లేచినా ఫర్వాలేదు."

ఇద్దరూ తాగుతూ టిన్ లోంచి ప్లేట్‌లోకి పోసిన వుప్పు కలిపి వేయించిన వేరుశనగ పప్పు తింటుండగా అడిగాడు దివాకర్.

"గోపీ ఇ-మెయిల్‌లో చాలా వివరాలు రాసాడు. కానీ నాకు పూర్తిగా బోధపడలేదు. అసలు నీ ప్లేన్ ఆఫ్ ఏక్షన్ ఏమిటి? ఎందుకడుగుతున్నానంటే నన్నీ విషయంలో నీకు సహాయం చేయమన్నాడు గోపీ" అడిగాడు దివాకర్.

"నేను వచ్చింది బిజినెస్ వీసా మీద. అది ఫాల్స్ అని మీకు తెలుసనుకుంటాను?"

"తెలుసు. సునీత చెప్పింది. ఇండియాలో లేని కంపెనీలో పనిచేసే నిన్ను నెగోషియేషన్‌కి ఇక్కడ సునీత పనిచేసే కంపెనీ పిలిచినట్టుగా కథ అల్లాడు గోపి. అది బాగా వర్కవుట్ అవడానికి రెండు కారణాలు. ఒకటి నిజంగా అమెరికాలో ఓ కంపెనీ ఆ పేర వుందని కన్సలేట్‌లో క్రాస్ చెక్ చేసి రూఢీ చేసుకోవడం. రెండోది నువు వచ్చేది పర్చేజ్ కోసం. పర్చేజ్ అంటే అమెరికాకి ఆదాయం. అదే సేల్స్ అయితే ఖర్చు."

"అది కూడా చూస్తారా?" ఆశ్చర్యంగా అడిగాడు విరించి.

"ఎందుకు చూడరు? ఇది పూర్తిగా కేపటలిస్ట్ దేశం. ఇక్కడి ప్రజలకి దాంట్లో భాగం అయిన ఉద్యోగస్థులకి కేపటలిజం బాగా వంటబట్టి వుంటుంది. నీకు వీసా రిజెక్ట్ చేస్తే అమెరికాకి అమ్మకాల ద్వారా వచ్చే డాలర్లు పోగొట్టుకోకూడదని ఆ కన్సలేట్ ఆఫీసర్‌కి వుంటుంది. మీ అన్నయ్య తక్కువవాడు కాడు. ఉన్న కొద్దేళ్ళలో అమెరికాని కాచి వడపోసాడు."

"నేను ఇక్కడికి ఐ.ఎన్.ఎస్.ఆఫీస్‌కి వెళ్ళి పొలిటికల్ అసైలమ్‌కి అప్లయ్ చేయడానికి మీ సహాయం కావాలి" చెప్పాడు విరించి.

"ఓ.కే"

"తర్వాత వర్క్ పర్మిట్ రాగానే నాకు వుద్యోగం చూసి పెట్టాలి."

"ఓ.కే."

"ఆ తర్వాత నేనుండటానికి అకామిడేషన్ చూసి పెట్టాలి."

"ఓ.కే నో ప్రాబ్లమ్. అసైలమ్‌కి ఎప్పుడు అప్లయ్ చెయ్యాలి?"

"వచ్చే సోమవారం."

"ఇక్కడ ఆక్సిజన్‌లా సెలవులు కూడా విలువైనవి. సోమవారం కుదరదు. ఆ రోజే వెళ్ళాలని ఏమన్నా వుందా?"

"లేదు."

"వచ్చే గురువారం పెట్టుకుందాం."

"అలాగే."

ఆ రాత్రి ఇద్దరూ లేట్‌గా, మత్తుగా పక్కలమీదకి చేరుకున్నారు.

దివాకర్ విరించిని మర్నాడు తన అటార్నీ దగ్గరికి తీసుకెళ్ళాడు. విరించి ఇచ్చిన ఎవిడెన్స్ ఫైల్‌ని ఆయన ఎంతో ఆసక్తిగా చదివాడు. తెలుగు దినపత్రికల్లో వచ్చిన వార్తల కన్నింటికి ఇండియాలోనే ఇంగ్లీష్ అనువాదాలు టైప్ చేయించి వాటికి జత చేసాడు గోపీనాథ్

పొలిటికల్ ఎసైలమ్ అప్లికేషన్ ఫారాన్ని అటార్నీ విరించి కోసం ముందే తెప్పించి వుంచాడు. దాన్ని ఆయన విరించితో జాగ్రత్తగా, తన కిచ్చిన సమాచారంతో ఫిలప్ చేయించాడు. ఒకటి రెండు చోట్ల అప్లికేషన్ ఫారంలో ఇచ్చిన స్పేస్ సరిపోకపోతే తెల్లకాగితం మీద దాన్ని రాసి ఆ ఫారానికి స్టేపిల్ చేసారు.

అప్లికేషన్‌తోపాటు ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్ పేపర్‌లో ఫోటో ఎలా వుండాలో ఎంతో వివరంగా ఇచ్చారు.

అప్లికేషన్ తారీకుకి ముప్పైరోజులలోగా తీసుకున్న ఫొటో అయివుండాలి. గడ్డం నించి జుత్తుదాకా ఓ అంగుళం వుండాలి. కుడిచెవి స్పష్టంగా కనిపించేలా త్రిఫోర్త్స్ ఫ్రంటల్ వ్యూ ఏంగిల్‌లో ఫోటో వుండాలి.

వాటిన్నిటినీ రిజిస్టర్డ్ పోస్టుద్వారా యు.ఎస్. ఇమిగ్రేషన్ కార్యాలయానికి పంపవచ్చు. స్వయంగా తీసుకెళ్ళి సబ్‌మిట్ చేయాల్సిన అవసరం లేదు. ఆ ప్రకారం అమెరికాలో, అప్లికేషన్స్ సబ్‌మిట్ చేయాల్సిన అవసరం లేదు. ఆ ప్రకారం అమెరికాలో, అప్లికేషన్స్ సబ్‌మిట్ చేయడానికున్న నాలుగు చిరునామాల్లో, కేలిఫోర్నియా రాష్ట్రం ఎడ్రస్సు వాళ్ళు సబ్‌మిట్ చేయాల్సిన యు.ఎస్. ఇమిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ సర్వీస్ యొక్క వెస్టన్ సెంటర్‌కి, పోస్ట్ బాక్స్ నంబర్ 10589కి రిజిస్టర్డ్ పోస్ట్‌లో పంపాడు విరించి. సునీత ఇంటికి వారం రోజుల్లో అది అందినట్లు అకనాలెడ్జ్ మెంట్ కూడా వచ్చింది.

ఫలానా రోజున శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఐ.ఎన్.ఎస్. ఆఫీస్‌లోని పొలిటికల్ అసైలమ్ సెక్షన్‌లోని ఆఫీసర్ రాబర్ట్ పార్కర్‌ని కలవమని కూడా అందులో వుంది.

ఇ - మెయిల్ ద్వారా ఆ సమాచారం ఎప్పటికప్పుడు విరించి తన అన్న గోపీనాథ్‌కి పంపుతూనే వున్నాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**